## వన్యప్రాణుల వేటగాళ్ల పై ఉక్కుపాదం

**జిల్లా వ్యాప్తంగా 30 ప్రత్యేక బృందాలతో దాడులు**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** జిల్లాలో వన్యప్రాణులను వేటాడుతున్న ముఠాల ఆట కట్టించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కఠిన చర్యలు చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా 30 బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో భాగంగా తలమడుగు, బోథ్, నేరడిగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఆరు కేసులు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి జింక కొమ్ములు, జింక చర్మం, నెమలి ఈకలతో పాటు వేటకు ఉపయోగించే వలలు, హెడ్లైట్లు, కరెంట్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. తలమడుగుకు చెందిన ఆడే సునీల్, బోథ్కు చెందిన సోలంకి దాసు, రాథోడ్ గణేష్, నేరడిగొండ ప్రాంతానికి చెందిన కనక సాగర్, శంకర్, మడావి శ్రీనివాస్లను నిందితులుగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వన్యప్రాణులను సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని, వాటిని వేటాడడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని ఎస్పీ హెచ్చరించారు. అడవి జంతువుల ప్రాణాలకు హాని కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, 8712659973 వాట్సాప్ నంబర్కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ నేరస్థులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## ఇందిరా మహిళా శక్తి సంఘ మహిళలకు చీరల పంపిణీ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని 27వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమంలో భాగంగా "ఇందిరా మహిళా శక్తి"స్వయం సహాయక సంఘ మహిళలకు మంగళవారం చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ సిద్ధం రాజేశ్వరి శ్రీనివాస్ చేతుల మీదుగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అక్కాచెల్లెమ్మల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయమని పలువురు మహిళలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోళ్లు వేగవంతం

- **రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా లో జొన్నల కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా యంత్రాంగం సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ సమీప కొనుగోలు కేంద్రాల్లో టోకెన్లు, గన్నీ బ్యాగులు తీసుకుని 51 కిలోల చొప్పున జొన్నలను నింపుకోవాలని సూచించారు. అనంతరం మార్కెట్ యార్డ్ పక్కన ఉన్న వెయ్ బ్రిడ్జ్ వద్ద తూకం చేయించుకుని, డాల్డా కంపెనీ గోదాంలో అన్లోడ్ చేయాలని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఖాళీ వాహనాన్ని మళ్లీ తూకం చేయించి మార్కెట్ యార్డ్లో తక్ పట్టీ తీసుకోవాలని వివరించారు. కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు ఎదురైనా రైతులు నేరుగా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల ను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జూన్ 1వ తేదీన కొమరంభీం ఆసిఫాబాద్ మండలం కొలం కొరారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కెరమెరి మండలం కోలం కొరారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు.అదే విధంగా, సభకు విచ్చేసే ప్రజలకు మరియు లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## బురదమయంగా మిషన్ భగీరథ నీరు.. తాగేదెలా?

- **మండలకేంద్రంలో కలుషిత నీటి సరఫరాపై ప్రజల ఆందోళన**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ హామీ నేరడిగొండ మండల కేంద్రంలో నీరుగారుతోంది. మంగళవారం మండల కేంద్రంలో సరఫరా చేసిన మిషన్ భగీరథ నీరు బురద రంగులో, కలుషితమై రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాగడానికి భయపడుతున్న ప్రజలు..**

పైపుల ద్వారా వస్తున్న నీటిని చూసి గ్రామస్తులు షాక్కు గురయ్యారు. నీరు పూర్తిగా పచ్చని రంగులో, దుర్వాసనతో వస్తుండటంతో వీటిని తాగడం అసాధ్యమని, ఈ నీరు తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే సరైన పర్యవేక్షణ లేక కలుషిత నీరు సరఫరా అవుతోందని పలువురు వాపోతున్నారు.

**వేసవిలో అధికారుల నిర్ల క్ష్యంపై ఆగ్రహం..**

ఇప్పటికే వేసవి తాపం మొదలై ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, అందుతున్న నీరు కూడా కలుషితమై ఉండటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి పైపు లైన్లలో లీకేజీలను గుర్తించి, క్లోరినేషన్ ప్రక్రియను పక్కాగా చేపట్టి, నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## చదువుకునే వయసులో.. కర్రలపై విన్యాసాలు

- **పొట్టకూటి కోసం తప్పని బాల కార్మికుడి పోరాటం**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పిల్ల లు బడిలో పుస్తకాలతో ఉండాల్సిన వయసులో, ఆ పన్నెండేళ్ల బాలుడు మాత్రం ప్రాణాలకు తెగించి కర్రలపై విన్యాసాలు చేస్తున్నాడు. కడుపు నింపుకునేందుకు ఊరూరా తిరుగుతూ, మండుతున్న ఎండను కూడా లెక్కచేయకుండా బిక్షాటన చేస్తున్న దృశ్యం అందరినీ కలచివేస్తోంది. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు ఉపాధి కోసం వలస వచ్చి నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకున్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాల వద్ద ఈ బాలుడు కర్రలపై నిలబడి, అసాధ్యమైన విన్యాసాలను చేస్తూ బిక్షాటన చేస్తూ కనిపించాడు.

**కన్నీరు పెట్టిస్తున్న పరిస్థితి..**

ప్రస్తుతం సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఎన్ని చట్టా లు ఉన్నప్పటికీ, ఇంకా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం విషాదకరం. బాలుడికి చదువుకోవాలనే ఆశ ఉన్నా, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇలా వీధుల వెంబడి తిరగాల్సిన దుస్థితి నెలకొంది. భయంకరమైన ఎండలో గంటల తరబడి విన్యాసాలు చేస్తూ, ప్రజల నుంచి చిల్లర పైసలు ఆశిస్తున్న తీరు చూస్తుంటే సామాన్యుల గుండెలు కరుగుతున్నాయి.

**అధికారులు స్పందించేనా..?**

చదువుకోవాల్సిన వయసులో బాలుడు ఇలా రోడ్లపై తిరుగుతుండటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు తక్షణమే స్పందించి ఆ బాలుడిని గుర్తించాలని వారు కోరుతున్నారు. బాలుడికి కనీస వసతులు కల్పించి, ప్రభుత్వం సంక్షేమ వసతి గృహంలో చేర్పించి చదువుకునేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వీఓఏల సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేరడిగొండ మండలంలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఉధృతమైంది. మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించిన వీఓఏలు అనంతరం మండల తహశీల్దార్ ఎంఏ కలీమ్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏ సంఘం మండల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పన, ఇతర సంక్షేమ పథకాల అమలు విషయాలను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని, వీఓఏల సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వం ప్రకటిస్తున్న ఇతర ప్రయోజనాలను వీఓఏలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే చర్చలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల వీఓఏల సంఘం నాయకులు భూపతి రాజు, ప్రభాకర్, కె.రాజు, గంగారాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సేవ చేసే అవకాశం కల్పించడం అభినందనీయం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రైతులకు సేవ చేసే అవకాశం కల్పించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు ఏలేటి మోహన్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీరామోజీ నారాయణ, ఆత్రం నగేష్లు మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ యార్డుల అభివృద్ధి కోసం నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆడే గజేందర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామని, మార్కెట్ యార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బొడ్డు దత్తాత్రి, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కన్వీనర్ అనుపట్ల సంజీవ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, బ్లాక్ ఆత్మ డైరెక్టర్ అందు సింగ్, మాజీ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏరెకరీ ఆడేళ్లు, చంద్ర విఠల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

**• ప్రగతి నగర్లో వీఓ బిల్డింగ్ నిర్మాణానికి భూమిపూజ**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలంలో మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా వీఓ భవనాల నిర్మాణ కార్యక్రమం చేపట్టగా, మండలంలోని అంబేద్కర్ నగర్ క్రాంతి వీఓ, ప్రగతి నగర్ వణితావాణి వీఓలకు చెందిన భవనాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి నగర్లో ఏర్పాటు చేయనున్న మహిళా సంఘాల వీఓ బిల్డింగ్కు సర్పంచ్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, ఉప సర్పంచ్ ఎడుకొండలరావు చేతుల మీదుగా శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, మహిళల ఆర్థిక స్వాలంబనకు వీఓ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, పొదుపు కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయని పేర్కొన్నారు. మహిళలు తమ సమస్యలను చర్చించుకునేందుకు, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఈ వీఓ భవనాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ సాయి పాల్గొని నిర్మాణ పనుల వివరాలను వివరించారు. భవన నిర్మాణం నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు నరసింహ స్వామి, నవకుమార్, శ్యామ్, గోదా చెన్నారావు, లాజర్, రాంబాబు, మారయ్య, వెంకటేశ్వరావు, రాము, శ్రీను తదితరులు పాల్గొని మహిళా సంఘాల కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. మహిళా సంఘాల సభ్యులు కృష్ణవేణి, పద్మ, ప్రమీల, సుప్రియ, మారతి, మరియమ్మ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక భవనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశాలు నిర్వహించడానికి ఇప్పటి వరకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇకపై తమ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఎపిఎం కే.వి. సుబ్బారావు, సీసీలు ఎస్. ప్రసాదరావు, పి. కృష్ణ, ఎస్కే షబ్బీర్, ఎమ్. ప్రసాద్, ఆర్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లో చేరిన కాటేపల్లి నాయకులు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** బెజ్జూర్ మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన మడే శైలం, కొంక సత్తయ్య, తిరుపతి తదితర నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ నాయకత్వంపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కొత్తగా చేరిన నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ సూచించారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ మండలం పోతేపల్లి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి



**ఉద్యమ కెరటం, బోథ్:** పేద ప్రజలకు అత్యవసర సమయాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత భరోసానిస్తుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5,34,800 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేదల ఆరోగ్య, అత్యవసర అవసరాల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నేరడిగొండ మండలానికి చెందిన భూమగౌడ్కు రూ.45,500, సింధం లక్ష్మికి రూ.44వేలు, లక్కవతుల గంగామణికి రూ.41,500, కట్కం లక్ష్మికి రూ.29,500, జ్ఞానేశ్వర్కు రూ.28,500, సయ్యద్ రజిఒద్దీన్కు రూ.25,500, నజ్రిన్కు రూ.18,500, చౌపడే శిల్పకు రూ.17,500, అత్తం లక్ష్మికి రూ.15వేలు, కైలాస బాయికి రూ.14వేల చెక్కులు అందజేశారు. అలాగే బోథ్ మండలానికి చెందిన సగ్గిడి రంజిత్కు రూ.60వేలు, భీంపూర్ మండలానికి చెందిన రమేష్కు రూ.55వేలు, ఇచ్చోడ మండలానికి చెందిన మడవి శ్రీకాంత్కు రూ.40వేలు, మల్లేష్కు రూ.30వేలు, బజార్ హత్నూర్ మండలానికి చెందిన దివ్య జ్యోతికి రూ.22,500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బొడ్డు దత్తాత్రి, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్, ఏఎంసీ ఉపాధ్యక్షులు ఏలేటి మోహన్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీరామోజీ నారాయణ, ఆత్రం నగేష్, మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, నాయకులు అనుపట్ల సంజీవ్, బద్దం పోతారెడ్డి, అందు సింగ్, సద్దాం, ఆడేళ్లు, చంద్ర విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ వీఓ భవన నిర్మాణానికి భూమిపూజ




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని వడూర్ గ్రామంలో మహిళా సంఘాల బలోపేతం, వారి కార్యకలాపాల నిర్వహణ కోసం నిర్మించనున్న ఐకేపీ వీఓ సమాఖ్య భవన నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేందుకు, స్వయం సహాయక సంఘాలు తమ సమావేశాలను సక్రమంగా నిర్వహించుకునేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎరడ్ల మమత, పంచాయితీ కార్యదర్శి సద్దాం, సీసీ సాగర్, నాయకులు చంద్రశేఖర్, వార్డు సభ్యులు ఊషన్న, లక్ష్మణ్, రమణ, షోయేబ్, ప్రశాంత్, వీఓ సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాల సభ మంగళవారం గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికల రక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. చదువు ద్వారానే బాలికల భవిష్యత్తు మారుతుందని, బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీల మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ వారోత్సవాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహ రహిత వాతావరణాన్ని నిర్మించడానికి తమ పంచాయతీ తరఫున పూర్తి స్థాయిలో కృషి చేస్తామని, మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# ఐకేపీ వీఓఏల సమ్మెకు సీఐటీయూ మద్దతు

**• కనీస వేతనం రూ.26వేలు అమలు చేసే వరకు పోరాటం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ఎన్నో ఏళ్లు గా సేవలందిస్తున్న ఐకేపీ వీఓఏలకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వేంసూరులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనంగా నెలకు రూ.26వేల చొప్పున చెల్లించాలని, వారిని సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వారికి సీసీలు, అకౌంటెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల పెంపులో స్పష్టత లేదని, కేవలం ఇండస్ట్రియల్ కార్మికులకు మాత్రమే వర్తించేలా నిర్ణయం తీసుకోవడం అన్యాయమని విమర్శించారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని, ఈ పోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటూరి మణి, వరకా శృంగారం, జయలక్ష్మి, వరలక్ష్మి, దేవమణి, ప్రసాద్, రాధాకృష్ణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నూతన పనులకు శ్రీకారం



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉపాధిహామీ పథకం కింద మాదారం గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టనున్న నూతన పనులను మంగళవారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదారం పంచాయతీ కార్యదర్శి అల్లా వుద్దీన్, కాంగ్రెస్ నాయకులు మీసా శంకర్, కమలాకర్, సత్యనారాయణ, శంకరయ్య, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ప్రసాద్, విజయ్, మేట్ పుష్పతో పాటు ఉపాధిహామీ కార్మికులు పాల్గొన్నారు.

# రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలి

**• ఇచ్చోడ మార్కెట్ యార్డ్ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పంట కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్కు వస్తున్న పంట దిగుబడులు, ప్రస్తుత కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యార్డ్లో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ మార్కెట్ యార్డ్కు పంటను తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగాలని, తూకాల్లో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కొనుగోలు చేసిన పంటను సకాలంలో గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలను వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రామారావు, తహశీల్దార్ ఇమ్రాన్, పాక్స్ చైర్మన్ ఎ.శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ జె. జకు, స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నిరోధించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** విద్యార్థులు, యువతపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి భాస్కర్తో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. మానసిక వైద్య నిపుణులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి యువతకు చైతన్యం కల్పించాలని సూచించారు. విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. చట్టవిరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లు విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని తెలిపారు. డిసిపి భాస్కర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. జిల్లా సరిహద్దుల్లో శాశ్వత చెక్పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పోలీస్, విద్య, సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు ఇంటిపై పడ్డ చెట్టు

## పాక్షికంగా ఇల్లు ధ్వంసం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని నగరం గ్రామంలోని ఎస్టీ కాలనీలో మంగళవారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు మడే కిష్టయ్యకు చెందిన ఇంటిపై చెట్టు పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో రామక్కకు స్వల్ప గాయాలు కాగా, కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంటిపై పడిన చెట్టు కొమ్మలను తొలగించారు. అలాగే గోపాల్ నగర్ మూలమలుపు వద్ద రహదారిపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు, అధికారులు కలిసి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ రెండు ఘటన స్థలాలను తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై కె.ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి.పద్మజ, గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలను మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన చింతలపాటి రాములు కుటుంబ సభ్యులను కలిసి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మరణించిన గండ్ర ఉపేంద్ర కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మన్నే చంటి మాతృమూర్తి మన్నే అచ్చమ్మ కుటుంబ సభ్యులను కలిసి ఓదార్పునిచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సండ్ర వెంకట వీరయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేపు రామారావు, చెన్నూరు గ్రామ సర్పంచ్ జీనుగు శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న అల్పాహారం పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్కు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఖమ్మం జిల్లా మధిరలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్కు స్థలం అప్పగించే కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మధిర కేంద్రం నుంచే అల్పాహారం, భోజనం సరఫరా చేస్తామని ప్రకటించడం సరైన విధానం కాదన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. అల్పాహారం పథకాన్ని కూడా స్థానిక వంట కార్మికుల ద్వారానే అమలు చేస్తే విద్యార్థులకు నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, మధ్యాహ్న భోజనం, అల్పాహారం పథకాలను స్థానిక కార్మికుల ద్వారానే అమలు చేయాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అల్పాహారం పథకానికి సంబంధించిన నిధులను విడుదల చేయకుండా వెళ్లిపోయిందని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలకారపు రామారావు, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహీమ్ మున్నీసా, జిల్లా సమితి సభ్యులు మహాదేవ లక్ష్మి, పూచి సీత, జక్కంపూడి వెంకటలక్ష్మి, పారేపల్లి సత్యవతి, కారం నాగలక్ష్మి, చామకూర సత్యవతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జరీనా, మంగమ్మ, సీతమ్మ, కృష్ణవేణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహం లేని తెలంగాణ కోసం కృషి చేద్దాం

- బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు బాల్య వివాహాలతో కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో బాలికలకు వివాహం జరపడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. తక్కువ వయస్సులో గర్భధారణ కారణంగా రక్తహీనత, శక్తిహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో జన్మించే పిల్లలు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి కాకముందు వివాహం జరిపిస్తే సంబంధిత వారికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డు కాకుండా పాఠశాల రికార్డులు, జనన ధృవీకరణ పత్రాలనే ప్రామాణికంగా పరిగణిస్తారని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, కెరీర్పై దృష్టి పెట్టాలని సూచించారు. స్నేహ క్లబ్బులు పిల్లల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రభుత్వ పథకాలు 18 సంవత్సరాలు నిండిన వారికే వర్తిస్తాయని వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 100 సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి రెడ్డి, సర్పంచ్ మల్లుగారి పద్మ, సీడీపీఓ ఉమారాణి, సూపర్వైజర్ రేణుక, డీహెచ్ రోజా, డీసీపీఓ కవిత, చైల్డ్ హెల్ప్లైన్ సిబ్బంది వీరబోయిన సాయిరాం, వివిధ గ్రామాల సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు అపోహలు, వదంతులు నమ్మవద్దు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కొన్ని ప్రాంతాల్లో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలు చేస్తూ అపోహలు, వదంతులు సృష్టిస్తున్నారని, రైతులు వాటిని నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత, కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అవసరానికి అనుగుణంగా లారీలు, హమాలీలు, గోనె సంచులు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది జిల్లాలో సుమారు 1.50 లక్షల నుంచి 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ జరుగుతుందని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను వచ్చే 10 నుంచి 12 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎస్డబ్ల్యూసీ శాఖల అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# హమాలీల సంఖ్య పెంచి అన్లోడింగ్ వేగవంతం చేయాలి

- త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి
- ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, హమాలీల సంఖ్య పెంచి అన్లోడింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లుసరిపడా వాహనాలు సమకూర్చేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. మంగళవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా, రవాణా తదితర శాఖల జిల్లా అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యాన్ని మిల్లులు, గోదాంలకు తరలింపు, అన్లోడింగ్ పురోగతి, ఆన్లైన్ ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరుగుతోందా అనే విషయంపై ఆరా తీశారు. మిల్లుల వారీగా అన్లోడింగ్ వివరాలు తెలుసుకొని, అవసరమైన చోట హమాలీల సంఖ్య పెంచుకునేలా మిల్లర్లకు ఆదేశాలు ఇవ్వాలని చెప్పారు. రోజువారీగా కొనుగోళ్ల శాతం పెరుగుతూ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులు, గోదాంలకు తరలించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. గన్నీ బ్యాగులు, ట్యాబ్ ఎంట్రీల పురోగతిపై కూడా సమీక్షించారు. కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అపరెల్ పార్కు తరలించి అన్లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అన్నారు. అదేవిధంగా వాహనాలను అవసరమైన ఇతర కొనుగోలు కేంద్రాలకు మళ్లించాలని తెలిపారు. తూకం వేసి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లుసరిపడా వాహనాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లులు, గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం జైపూర్ మండలం రామారావుపేటలోని వరలక్ష్మి, సుముఖ గోదాములను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు తెలిపారు. గోదాములకు చేరిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేయాలని, రోజుకు కనీసం 40 నుంచి 50 లారీల వరకు ధాన్యం దిగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం దిగుమతికి అవసరమైన హమాలీలను సమకూర్చామని, ఈ నెలాఖరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం భీమారం తహశీల్దార్తో కలిసి అర్కపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు కేంద్రంలో ఏర్పడిన హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించారు. తాలు, తప్ప లేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

